ముంబైలోని తమ నివాసంలో ఫుట్‌బాల్ లెజెండ్ డేవిడ్ బెక్‌హామ్‌తో రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముకేశ్ అంబానీ కుటుంబ సభ్యులు

ధరాఘాతం తప్పదు

ద్రవ్యోల్బణం ఇప్పట్లో తగ్గదు • అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న సంకేతాలు

నీరసించిన ఉత్పాదక రంగం • రిజర్వ్ బ్యాంక్ బులెటిన్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 16: ద్రవ్య విధాన చర్యలు, సరఫరా సజావుగా జరగడానికి తీసుకున్న నిర్ణయాల ఫలితంగా రిటైల్ ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించినప్పటికీ, ధరల ముప్పు ఇంకా తొలగిపోలేదని రిజర్వ్‌బ్యాంక్ బులెటిన్ వెల్లడించింది. ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం నవంబర్ బులెటిన్‌లో వివరిస్తూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి మనం చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని వ్యాఖ్యానించింది. ప్రస్తుత త్రైమాసికంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయని, ఉత్పాదక రంగం నీరసించిందని, సర్వీసుల రంగం కొవిడ్ తదుపరి విస్తరణ మరింత కొనసాగే అవకాశాలు తక్కువని ఆర్బీఐ బృందం అభిప్రాయపడింది. కఠిన ద్రవ్య పరిస్థితులతో గ్లోబల్ ఎకానమీకి గణనీయమైన రిస్క్ ఏర్పడుతున్నదని హెచ్చరించింది.

గత రెండు నెలల్లో కాస్త ఊరట

ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో సగటున 6.7%, ఈ ఏడాది జూలై-ఆగస్టుల్లో 7.1 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం గత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 5 శాతం, 4.9 శాతానికి దిగివచ్చడం కాస్త ఊరటనిచ్చే అంశమని ఆర్బీఐ బులెటిన్ పేర్కొంది. 2022-23లో వరుసగా ఏడు నెలలపాటు దడపుట్టించిన ద్రవ్యోల్బణం 2022 నవంబర్‌లో ఆర్బీఐ నిర్దేశితస్థాయి 6 శాతం దిగువకు తొలిసారిగా తగ్గిందని, అటుతర్వాత మళ్లీ పెరుగుతూ వచ్చిందని వివరించింది. ఇటీవల తిరిగి నెమ్మదించినట్టు కన్పిస్తున్నా, ధరల ముప్పు నుంచి 'మనం ఇంకా బయటపడలేదు. చాలా మైళ్ళ దూరం ప్రయాణించాల్సి ఉంది' అని ఆర్బీఐ బృందం వ్యాఖ్యానించింది.



జీడీపీకి పండుగ జోష్

పండుగ సీజన్ డిమాండ్ ఫలితంగా ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరం క్యూ3లో జీడీపీ క్యూ2కంటే పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు బులెటిన్ తెలిపింది. మౌలిక రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయాలు, ప్రైవేటు రంగ మూలధన పెట్టుబడులు పెరగడం, ఆటోమేషన్, డిజిటలైజేషన్ తదితరాలు ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇస్తున్నాయన్నది. కొవిడ్ ముందస్తు స్థాయికి జీడీపీ చేరుతుందని, మార్కెట్ ఎక్స్చేంజ్ రేట్ల ప్రకారం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తున్నదని తెలిపింది. కనిష్ఠ కరెన్సీ ఒడిదుడుకులు, ఆరోగ్యకరస్థాయిలో విదేశీ మారకపు నిల్వలు, విదేశీ మూలధన పెట్టుబడుల కారణంగా కరెంటు ఖాతా లోటు అదుపు తదితర అంశాలు భారత్‌కు కలిసివస్తున్నాయని వివరించింది.

టీ హబ్ స్టార్టప్‌లకు నిధుల వరద

- గత ఎనిమిదేండ్లలో రూ.29 వేల కోట్ల పెట్టుబడులు
- రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్



హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎనిమిదేండ్ల క్రితం చిన్న స్థాయిలో ప్రారంభమైన టీ హబ్ ప్రస్తుతం దేశంలోనే స్టార్టప్ హబ్‌గా ఎదిగిందని, ఇందులోని సంస్థలు 3.5 బిలియన్ డాలర్ల(29 వేల కోట్లకు పైగా) నిధులు ఆకర్షించాయని రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. టీ హబ్ ప్రారంభించి ఎనిమిదేండ్లు పూర్తైన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రారంభమైన టీ హబ్ సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని, ఇక్కడి నుంచి రోజుకొక స్టార్టప్‌లు పుట్టుకొస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు చాలా స్టార్టప్‌లు వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించాయని, వీటితోపాటు 600 కార్పొరేట్ సంస్థలతోనూ జతకట్టాయని, 500 మంది మెంటార్‌తో కలిసి 3 వేలకు పైగా స్టార్టప్‌లను టీ హబ్ ప్రోత్సహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇప్పటికే టీ హబ్ ద్వారా టీ బ్రిడ్జ్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రపంచవ్యాప్తంగా స్టార్టప్‌లకు మార్కెటింగ్ అవకాశాలను కల్పించామన్నారు. టీ హబ్ వ్యవస్థాపక డైరెక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. టీ హబ్ ఎదుగుదల ఎంతో గర్వించదగిన విషయమని, స్టార్టప్ రంగంలోనే సరికొత్త వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేసిందన్నారు.

6 పరిశ్రమల దిగ్గజాలతో ఒప్పందం..

ఎనిమిదేండ్లు పూర్తైన సందర్భంగా టీ హబ్ తాజాగా 6 ప్రముఖ పరిశ్రమలతో జట్టు కట్టింది. ఇందులో కేర్, క్యారియర్ గ్లోబల్, సిడ్బీ, ఫాల్కన్ ఎక్స్, కేపీఎంజీ, అసోసియేషన్ ఆఫ్ జియో స్పేషియల్‌తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వీటితో పాటు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న సోషల్ బిజినెస్, డిజైన్ థింకింగ్, క్రాస్ బార్డర్ సపోర్ట్, జియోస్పేషియల్ ఇన్నోవేషన్ రంగాల్లోనూ ఎక్కువగా దృష్టిని సారించింది.

స్టాండర్డ్ గ్లాస్‌లో ఆసాహీ 200 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, నవంబర్ 16: గ్లాస్ లైన్డ్ ఎక్విప్‌మెంట్ రంగంలో ఉన్న హైదరాబాద్‌కి చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీలో ఇంజనీర్ గ్లాస్ సిస్టమ్స్ తయారీ కంపెనీ ఆసాహీ గ్లాస్‌ప్లాంట్(ఏఐజీ జపాన్) రూ.200 కోట్ల మేర పెట్టుబడి పెట్టింది. దీంతో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీలో ఏఐజీ జపాన్, జీఎల్ హాకో అనుబంధ కంపెనీలకు వాటా వాటా దక్కనున్నది. జీఎల్ హాకో ఉత్పత్తులను పెద్ద ఎత్తున మార్కెట్ చేయడంతోపాటు గ్లాస్-లైన్డ్ రియాక్టర్ల భద్రతను పెంపొందించడానికి ఎస్ఈఎఫ్ గ్లాస్ టెక్నాలజీని రూపొందించాలని స్టాండర్డ్ గ్రూపు లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ ఎండీ నాగేశ్వర రావు తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్‌కు సమీపంలో 36 ఎకరాల్లో భారీ స్థాయిలో గ్లాస్ ఎక్విప్‌మెంట్ తయారీ ప్లాంటును స్టాండర్డ్ గ్లాస్ నిర్మిస్తున్నదన్నారు. వెల్డింగ్ రోబోలు, సెమీ ఆటోమేటెడ్ కట్టింగ్, బెండింగ్, వెల్డింగ్ యంత్రాలు, అధునాతన వెల్డింగ్ పవర్ సోర్సెస్‌తో సహా అత్యాధునిక యంత్రాలను నెలకొల్పుతున్నారు. 2012లో ప్రారంభమైన స్టాండర్డ్ గ్రూపు ప్రస్తుత టర్నోవర్ రూ.750 కోట్లుగా ఉన్నది.

66 వేల పైకి సెన్సెక్స్

ముంబై, నవంబర్ 16: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ వార్తలు వచ్చినప్పటికీ ఐటీ, టెక్నాలజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో సూచీలు కదంతొక్కాయి. అమెరికా ద్రవ్యోల్బణం అంచనావేసినస్థాయిలో నమోదవడం, బాండ్ ఈల్డ్ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశాలు లేకపోవడంతో ఒక దశలో 66 వేల పాయింట్ల పైకి చేరుకున్న సెన్సెక్స్ చివరకు 306.55 పాయింట్లు ఎగబాకి 65,982.48 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ సైతం 89.75 పాయింట్లు అందుకొని 19,765.20 వద్ద నిలిచింది. దేశీయ టెక్నాలజీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఈ నెల 25న బైబ్యాక్ ప్రకటించింది.

- టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్‌లు రెండు శాతానికి పైగా పెరిగాయి.
- బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్, విప్రో, టాటా మోటార్స్, టైటాన్ షేర్లు ఒక్క శాతానికి లాభపడ్డాయి.
- సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్‌లు పెరిగాయి.
- కానీ, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, నెస్లే, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎయిర్‌టెల్, ఎస్బీఐ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ రంగ సూచీ 2.59 శాతం, టెక్ 2.13 శాతం, హెల్త్‌కేర్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, టెలికమ్యూనికేషన్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు లాభాల్లో ముగియాయి.
- ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, మెటల్ రంగ షేర్లు నష్టపోయాయి.

ఎఫ్‌పీఐల పెట్టుబడి విలువ రూ.54 లక్షల కోట్లు

భారత్ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) పెట్టుబడి విలువ సెప్టెంబర్ త్రైమాసికంలో 15 శాతం పెరిగి 651 బిలియన్ డాలర్లకు (రూ.54.16 లక్షల కోట్లు) చేరింది. ముగిసిన త్రైమాసికంలో ఎఫ్‌పీఐల నికర కొనుగోళ్లు పెరగడం, ఈక్విటీ మార్కెట్ మంచి పనితీరును కనపర్చడంతో నిరుడు ఇదే త్రైమాసికంలో 566 బిలియన్ డాలర్లుగా ఉన్న పెట్టుబడులు 651 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు మార్నింగ్‌స్టార్ విడుదల చేసిన రిపోర్ట్‌లో పేర్కొంది. క్యూ1తో పోలిస్తే 626 బిలియన్ డాలర్ల నుంచి 4 శాతం పెరిగినట్టు తెలిపింది. అయితే భారత ఈక్విటీ మార్కెట్ విలువలో ఎఫ్‌పీఐల వాటా 17.33 శాతం నుంచి 16.95 శాతానికి తగ్గిందన్నది. విదేశీ ఇన్వెస్టర్లు ఈ సెప్టెంబర్ త్రైమాసికంలో 5.38 బిలియన్ డాలర్ల మేర నికర కొనుగోళ్లు జరిపారని వెల్లడించింది. అయితే ఆరు నెలల్లో తొలిసారిగా సెప్టెంబర్ నెలలో మాత్రం 1.78 బిలియన్ డాలర్ల విలువైన స్టాక్స్‌ను నికరంగా విక్రయించారన్నది. యూఎస్ బాండ్ ఈల్డ్స్ పెరగడం ఇందుకు కారణమని మార్నింగ్ స్టాక్ వివరించింది. అక్టోబర్‌లో 2.95 బిలియన్ డాలర్ల విక్రయాలు జరపగా, నవంబర్ 10 వరకూ 697 మిలియన్ డాలర్ల నిధుల్ని మార్కెట్ నుంచి వెనక్కు తీసుకున్నారు.

జియోకు మరో 32 లక్షల కస్టమర్లు

న్యూఢిల్లీ, నవంబర్ 16: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో వినియోగదారులను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. ఆగస్టు నెలలోనూ 32.4 లక్షల మంది కొత్త కస్టమర్లు జియో నెట్‌వర్క్‌ను ఎంచుకున్నారు. దీంతో మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 44.57 కోట్లకు చేరుకున్నట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరో టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్‌ను 12.17 లక్షల మంది కస్టమర్లు ఎంచుకోగా..ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వొడాఫోన్ ఐడియాను మాత్రం 49,782 యూజర్లను నష్టపోయింది. ఆగస్టు చివరినాటికి ఎయిర్‌టెల్ కస్టమర్ల సంఖ్య 37.64 కోట్లకు చేరుకోగా, ఇదే సమయంలో వొడాఫోన్ ఐడియా వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 22.82 కోట్లకు పరిమితమయ్యారు.

- ఆగస్టులో 1.26 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీ ద్వారా తమ నెట్‌వర్క్‌ను మార్చుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు.
- దీంతో ఇప్పటి వరకు ఎంఎన్‌పీ ద్వారా నంబర్ మార్చుకున్న వారి సంఖ్య 86.4 కోట్ల నుంచి 87.7 కోట్లకు చేరుకున్నారు.
- బ్రాండ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు స్వల్పంగా పెరిగి 87.6 కోట్లకు చేరారు.
- మొత్తం బ్రాండ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లలో తొలి ఐదు సంస్థల వాటా 98.35 శాతంగా ఉన్నది. వీరిలో రిలయన్స్ జియోకు 45.5 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్‌కు 25.3 కోట్లు, వొడాఫోన్ ఐడియా 12.5 కోట్లు, ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు 2.5 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు.
- ఆగస్టు చివరినాటికి దేశవ్యాప్తంగా వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 114.8 కోట్లకు చేరుకున్నారు.
- వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 3 కోట్లకు చేరారు. వీరిలో జియోకు 1.78 లక్షలు, భారతీ ఎయిర్‌టెల్ 1.16 లక్షల మంది జతయ్యారు.

పెన్నార్‌కు 669 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, నవంబర్ 16: రాష్ట్రానికి చెందిన ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థ పెన్నార్ ఇండస్ట్రీస్ రూ.669 కోట్ల విలువైన పలు ఆర్డర్లను చేజిక్కించుకున్నది. ఈ ఆర్డర్లు ఆర్ఎల్ఆర్ ఇన్‌ఫ్రా, ఎస్ఎన్‌జే డిస్టిలర్స్, అంతరిక్ష గ్రూపు, తైన్ ఇన్‌ఫ్రా, పవర్ మెక్ ప్రాజెక్ట్స్, ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్, టీవీఎస్ సంగ్లీ, ఎంఎస్ఆర్ అసెట్స్ నుంచి లభించినట్టు సంస్థ వెల్లడించింది. రైల్వే వర్టికల్‌కు సెయిల్ రైట్స్, ఐసీఎఫ్, టిటాగర్, టెక్స్‌మాకో, ఒరియంటల్ నుంచి వచ్చినట్టు తెలిపింది. ఈ ఆర్డర్లను వచ్చే రెండు త్రైమాసికాల్లో పూర్తి చేయనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

టాటా టెక్ ధరల శ్రేణి రూ.475-500

న్యూఢిల్లీ, నవంబర్ 16: టాటా టెక్నాలజీ ఐపీవో ధరల శ్రేణిని రూ.475 నుంచి రూ.500 మధ్యలో నిర్ణయించింది. ఈ నెల 22న ప్రారంభం కానున్న వాటాల విక్రయం 24న ముగియనున్నదని, తద్వారా రూ.3,042 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. యాంకర్ పెట్టుబడిదారుల కోసం ఈ నెల 21న నిర్వహించనున్నారు. 2004లో టీసీఎస్ ఐపీవోకి వచ్చిన తర్వాత టాటా గ్రూపు నుంచి వస్తున్న ఐపీవో ఇదే కావడం విశేషం. ఈ ఐపీవోల్లో భాగంగా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) రూట్‌లో 6.08 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.

హైదరాబాద్ ఆఫీస్‌కు క్రేజ్

పెద్ద ఎత్తున కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్న వుయ్‌వర్క్ ఇండియా

1.54 లక్షల చదరపు అడుగుల్లో కొత్త కో-వర్కింగ్ సెంటర్

2,220 డెస్కులతో ఏర్పాటు

న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబర్ 16: కో-వర్కింగ్ దిగ్గజం వుయ్‌వర్క్ ఇండియా.. హైదరాబాద్, బెంగళూరుల్లో భారీ ఎత్తున ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. 2.72 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని పొందినట్టు గురువారం ఆ సంస్థ తెలియజేసింది. ఆయా నగరాల్లోని ఈ ఆఫీస్ స్పేస్‌లో రెండు కొత్త కో-వర్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, వీటిలో దాదాపు 4,000 డెస్క్‌లుంటాయని పేర్కొన్నది. హైదరాబాద్‌తోపాటు న్యూఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ముంబై, బెంగళూరు, పుణె నగరాల్లో ఇప్పటికే సంస్థకు సెంటర్లున్నాయి. ఈ నగరాల్లోని 50 ప్రాంతాల్లో 65 లక్షలకుపైగా చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ వుయ్‌వర్క్ సొంతం.

వడివడిగా విస్తరణ

2017లో భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించిన వుయ్‌వర్క్.. హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో విస్తరిస్తున్నది. అయితే దక్షిణాది విపణిపై దృష్టి పెట్టిన సంస్థ.. రాష్ట్ర రాజధాని నగరంలో అవకాశాలకు తగ్గట్టు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నది. ఈ క్రమంలోనే ఇప్పుడు మరో కొత్త కో-వర్కింగ్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధమైంది. బెంగళూరు కంటే పెద్ద దిగా, 1.54 లక్షల చదరపు అడుగుల్లో హైదరాబాద్ కేంద్రం రానుండటం గమనార్హం. ఇందులో 2,220 డెస్కులుండనున్నాయి. బెంగళూరులో 1.17 లక్షల చదరపు అడుగుల్లో వుయ్‌వర్క్ కొత్త సెంటర్ వస్తుండగా, అక్కడ 1,700లకుపైగా డెస్కులుంటాయని కంపెనీ వర్గాలు చెప్తున్నాయి.

ఆర్ఎంజెడ్ స్పైర్‌లో..

హైదరాబాద్‌లోని ఆర్ఎంజెడ్ స్పైర్‌లో ఈ 1.54 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను వుయ్‌వర్క్ లీజుకు తీసుకున్నది. ఈ మేరకు లీజు ఒప్పందం జరిగినట్టు వుయ్‌వర్క్ తెలియజేసింది. అలాగే బెంగళూరులోని మాన్యతా రెడ్‌వుడ్‌లో 1.17 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని పొందామని, లీజ్ అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా ముగిశాయని వివరించింది. ఇదిలావుంటే వుయ్‌వర్క్ గ్లోబల్.. అమెరికా కోర్టులో ఇటీవల దివాళా ప్రక్రియకు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రభావం తమపై ఉండబోదని వుయ్‌వర్క్ ఇండియా స్పష్టం చేసిన సంగతీ విదితమే. వుయ్‌వర్క్ ఇండియాలో 73 శాతం వాటా బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్‌కనున్నది. వుయ్‌వర్క్ గ్లోబల్ కున్న వాటా 27 శాతమే. దీంతో ఏ రకంగానూ వుయ్‌వర్క్ గ్లోబల్ దివాళా.. వుయ్‌వర్క్ ఇండియా కార్యకలాపాలను దెబ్బతీయబోదని ఎంబసీ గ్రూప్ చెప్తున్నది.

మళ్లీ డిమాండ్

కరోనా దెబ్బకు వర్క్ ఫ్రమ్ హోం బాట పట్టిన కంపెనీలన్నీ.. తిరిగి ఆఫీసులను తెరుస్తున్నాయిప్పుడు. దీంతో ఆఫీస్ స్పేస్‌కు మళ్లీ డిమాండ్ కనిపిస్తున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 50 ప్రధాన ఫ్లెక్సిబుల్ స్పేస్ ఆపరేటర్లున్నారు. ఇందులో టాప్-10 ఆపరేటర్లదే మార్కెట్‌లో 84 శాతం వాటా అని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ చెప్తున్నది. కాగా, 'ఫ్లెక్సింగ్ ది వర్క్‌స్పేస్-బ్యాక్ టు ఆఫీస్' పేరిట ఇటీవల విడుదల చేసిన నివేదికలో దేశంలోని ఫ్లెక్సిబుల్ స్పేస్ ఆపరేటర్ల వద్దనున్న వెయ్యికిపైగా కేంద్రాల్లో 7.6 లక్షలకుపైగా డెస్కులు అందుబాటులో ఉన్నాయని వెస్టియన్ ప్రధానంగా పేర్కొన్నది. కాగా, డెడికేటెడ్ డెస్కులు, హాట్ డెస్కింగ్, కో-వర్కింగ్ స్పేసెస్, సర్వీస్డ్-మేనేజ్డ్ ఆఫీస్ స్పేసెస్‌నే ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌లుగా అభివర్ణిస్తున్నారు. దేశీయంగా వుయ్‌వర్క్ ఇండియాతోపాటు స్మార్ట్‌వర్క్స్, సింప్లీవర్క్ ఆఫీసెస్, ఆఫీస్, టేబుల్ స్పేస్, స్కూటర్, ది ఎగ్జిక్యూటివ్ సెంటర్, అర్బన్ వాల్ట్, ఇండీక్యూబ్, ఇంక్యూస్పేజ్, 91స్ప్రింగ్‌బోర్డ్, 315 వర్క్ అవెన్యూ, ఆకాశ కోవర్కింగ్, దీ ఆఫీస్ పాస్, అవంతా ఇండియా, బిహైవ్ వర్క్‌స్పేస్ వంటివి కో-వర్కింగ్ ఆఫీస్ స్పేస్ కంపెనీలుగా ఉన్నాయి.

రెడ్డీస్ నెరివియో

మైగ్రేన్ బాధితుల కోసం నయా డివైజ్

Dr. Reddy's

న్యూఢిల్లీ, నవంబర్ 16: మైగ్రేన్ బాధితులకు గొప్ప ఊరట. డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వియర బుల్ థెరపీ డివైజ్ 'నెరివియో'ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. దీన్ని ధరిస్తే.. ఇక ఔషధాల అవసరం లేకుండానే మైగ్రేన్ నొప్పిని నియంత్రించుకోవచ్చని, దాన్నుంచి ఉపశమనం పొందవచ్చని గురువారం సంస్థ తెలియజేసింది. ఈ డివైజ్‌కు అమెరికా ఆహార, ఔషధ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అనుమతి ఉన్నట్టు ఈ హైదరాబాదీ ఔషధ రంగ దిగ్గజం స్పష్టం చేసింది. కాగా, నెరివియో అనేది డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆధారిత నాన్-ఇన్వేసివ్ డివైజ్. 12 ఏండ్లు, ఆపై వయస్కుల కోసం దీన్ని తయారు చేశారు. చేతి పైభాగాన (భుజం-మోచేయి నడుమ) దీన్ని ధరించవచ్చని, తలనొప్పి మొదలైన 60 నిమిషాల్లోగా దీన్ని వాడితే బాధ నుంచి విముక్తి పొందడానికి ఎక్కువగా వీలుంటుందని కంపెనీ ఈ సందర్భంగా వివరించింది. అలాగే రోజు విడిచి రోజు దీన్ని ధరించినా మైగ్రేన్ నుంచి గొప్ప ఉపశమనాన్ని పొందవచ్చన్నది. అయితే ఈ డివైజ్ ధర ఎంతన్న వివరాలు మాత్రం తెలియపర్చలేదు. 'నెరివియోతో డిజిటల్ థెరపీటిక్స్‌లోకి మా ప్రవేశం జరిగింది. అటు వైద్యులకు, ఇటు రోగులకు చికిత్సలో ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ డివైజ్ వాడకంతో ట్యాబ్లెట్ల వినియోగం తగ్గుతుంది. ఇది మైగ్రేన్‌తోపాటు తీవ్రమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నవారికి ఊరటనే చెప్పవచ్చు' అని డాక్టర్ రెడ్డీస్ బ్రాండెడ్ మార్కెట్స్ విభాగం (భారత్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు) సీఈవో ఎంవీ రమణ అన్నారు. ఇదిలావుంటే యూరోపియన్ దేశాలైన జర్మనీ, ఆస్ట్రియా, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, నార్వే, పోలాండ్, స్లోవేకియా, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్, బ్రిటన్‌లలో నెరివియా మార్కెటింగ్, పంపిణీల కోసం డాక్టర్ రెడ్డీస్ ఇటీవలే అక్కడి సంస్థలతో ఒప్పందాలనూ కుదుర్చుకున్నది.

హీరోకు పండుగ కిక్కు

14 లక్షల వాహనాలు విక్రయించిన సంస్థ

న్యూఢిల్లీ, నవంబర్ 16: ద్విచక్ర వాహన ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ హీరో మోటోకార్ప్‌కు ప్రస్తుత పండుగ సీజన్ కలిసొచ్చింది. ఈ సీజన్‌లో ఏకంగా 14 లక్షల వాహనాలను విక్రయించి రికార్డు నెలకొల్పింది. ఒక పండుగ సీజన్‌లో ఇంతటి స్థాయిలో వాహనాలను విక్రయించడం కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. నవరాత్రి తొలిరోజు ప్రారంభమైన 32 రోజుల పండగ సీజన్ భాయ్ దూజ్(నవంబర్ 15న) ముగిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటంతోపాటు పలు నగరాల్లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో గతేడాదితో పోలిస్తే ఈసారి విక్రయాల్లో 19 శాతం అధికంగా నమోదయ్యాయని హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా తెలిపారు. క్రితం ఏడాది పండుగ సీజన్‌లో సంస్థ 12.7 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది. మార్కెట్లోకి నూతన ఉత్పత్తులను విడుదల చేయడం, బ్రాండ్‌కు మరింత ప్రమోషన్ కల్పించడం, నూతన షోరూంలను ఏర్పాటు చేయడం ఇందుకు కలిసొచ్చిందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అధికం..

నగరాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా వాహనాలు అమ్ముడయ్యాయని ఆయన చెప్పారు. ప్రధానంగా సానుకూల వర్షాలు కురియడం, పంటలు చేతికి రావడంతో ద్విచక్ర వాహనాలను అధికంగా కొనుగోళ్లు చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా నలు దిశలా అమ్మకాలు పెరిగాయని, ముఖ్యంగా దక్షిణ, ఉత్తర భారతంలో ఎక్కువగా వృద్ధి నమోదైందన్నారు. ఇక పండుగ సీజన్‌లోనే రిటైల్ సేల్స్ అధికంగా ఉంటాయని, మిగతా సీజన్‌లో అంతంత మాత్రంగానే ఉండనున్నాయని చెప్పారు.

దేశంలో 1900లకు జీసీసీలు: సీబీఆర్ఈ

న్యూఢిల్లీ, నవంబర్ 16: దేశీయంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) సంఖ్య 2025 నాటికి 1,900లకు చేరుకోవచ్చని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ సౌత్ ఏషియా గురువారం విడుదల చేసిన ఓ నివేదికలో అంచనా వేసింది. అలాగే అప్పటికల్లా మొత్తం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో 35-40 శాతం వాటా వీటిదే ఉండొచ్చన్నది. 'ఇండియాస్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్-చార్టింగ్ ఏ న్యూ టెక్నాలజీ ఎరా' పేరిట ఈ రిపోర్టును సీబీఆర్ఈ తెచ్చింది. భారత్‌లో జీసీసీల వృద్ధి, వాటి విస్తరణకు దోహదం చేస్తున్న అంశాలు, లీజింగ్ ప్రాధాన్యతల్ని ఇందులో వివరించింది. 'దేశంలో ఇప్పుడున్న దాదాపు 1,580 జీసీసీలు.. 2025కల్లా సుమారు 1,900లకు పెరగవచ్చు. ఈ వ్యవధిలో జీసీసీ లీజింగ్ కార్యకలాపాల వా